# వెలుగు దివ్వె..

- 25 పడకల కంటి ఆస్పత్రికి సన్నాహాలు
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో గ్రామాభివృద్ధి

కొత్తవరం(గుడ్లవల్లేరు):

ఇటీవల గ్రామంలో 60 వసంతాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి నుంచి గ్రామంలో అభివృద్ధి కార్యకలాపాలు ఊపందుకున్నాయి. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 25 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు ముందుకొచ్చారు. మూడు ఎకరాల్లో ఆస్పత్రి నిర్మించేందుకు అడిషనల్ డైరెక్టర్ సత్యజోజిప్రసాద్ బృందం గ్రామంలో సర్వే చేశారు. 2,500 చదరపు అడుగుల వైశాల్యంతో ఆస్పత్రి భవనాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో శ్రీ కానూరి దామోదరయ్య జెడ్పీ హైస్కూల్‌కు పంచాయతీ వారు ఎంపీ నిధులు రూ.లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.



ఇటీవల ప్రారంభించిన వాటర్ ప్లాంట్

దామోదరయ్య కుటుంబీకులు రూ.ఎనిమిది లక్షలతో హైస్కూల్‌కు రంగులు, వేదిక, అంతర్గత సీసీ రోడ్డు నిర్మించారు. స్థానిక పీఏసీఎస్ వారు వాటర్ ప్లాంట్ నిర్మించారు.

### సమ్మేళనంతో ఎంతో మేలు



ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వారు 25 పడకల ఆస్పత్రి నిర్మించనున్నారు. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఈ మేలు జరిగింది. దామోదరయ్య తాతగారు హైస్కూల్ కట్టించారు. మనం ఏమైనా చేయాలని జగదీశ్వరప్రసాద్ ముందుకొచ్చారు.

– కానూరి బాలకృష్ణ మోహన్, పారిశ్రామిక వేత్త

### ఆస్పత్రికి సర్వే..



25 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సర్వే చేశారు. 2,500 చదరపు అడుగుల భవనంలో ఆస్పత్రి నిర్మిస్తారు. పేదలకు ఉచితంగా వైద్య అందుతుంది. ఉన్నత వర్గాలకు నామమాత్రపు ఫీజులు ఉంటాయి.

– కానూరి జగదీశ్వరప్రసాద్, దామోదరయ్య మనవడు

### హైస్కూల్‌కు పూర్వ వైభవం



హైస్కూల్‌కు పూర్వ వైభవం వచ్చింది. రూ.ఎనిమిది లక్షలు దామోదరయ్య కుటుంబీకులు ఇచ్చారు. కంటి ఆస్పత్రి జగదీశ్వరప్రసాద్ పుణ్యమే. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఇంకా గ్రామానికి ఎన్నో జరుగనున్నాయి.

– చాపరాల జగన్మోహనరావు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్

### ఆదర్శంగా గ్రామం..



మా హైస్కూల్లో ఎక్కడా.. ఎన్నడు జరగని విధంగా 60 వసంతాలకు సంబంధించిన విద్యార్థులు వచ్చారు. గ్రామం అభివృద్ధి చెందేందుకు ఆస్కారం లభించింది. మాలా చుట్టుపక్కల గ్రామాల్లో ఇలాంటి సమ్మేళనం పెట్టుకునేందుకు మా గ్రామం ఆదర్శంగా నిలిచింది.

– సీహెచ్ ప్రసాద్, కాంట్రాక్టర్

సాక్షి Mon, 22 August 2016
epaper.sakshi.com/c/12659634

# విద్యార్థుల్లో పొదుపు కోసమే బ్యాంకు ఖాతాలు



వివరిస్తున్న ఏజీఎం వరాలమ్మ, మేనేజర్ నారాయణరావు తదితరులు

**కొత్తవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో డబ్బు విలువ, పొదుపు ఆవశ్యకతలను వివరించేందుకు కేడీసీసీ బ్యాంకు తొలిసారిగా విద్యార్థుల పేరిట జీవో బ్యాంక్ ఖాతాలను నిర్వహిస్తోందని కేడీసీసీ బ్యాంకు ఏజీఎం పెన్నేరు వరాలమ్మ పేర్కొన్నారు. మండలంలోని కొత్తవరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు 'ప్రాజెక్ట్ యంగ్ ఛాంపియన్'పై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. తల్లితండ్రులు ఇచ్చిన నగదును విద్యార్థులు దుబారా చేయరాదని అన్నారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు మేనేజర్ ఆర్.నారాయణరావు, సొసైటీ అధ్యక్షులు కానూరి చిట్టిబాబు, ఎండీ నాదెళ్ల సాంబశివరావు, హెచ్‌ఎం కుమారి, పీడీ ఇమ్మడి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కౌతవరంలో రైతుల శ్రమదానం



కాల్వలో డెక్క తొలగిస్తున్న రైతులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌత వరం రైతులు బుధవారం శ్రమదానంతో తమ పంటకాల్వను బాగు చేసుకున్నారు యడ్లకాల్వ బాగుచేతకు నెల కిందట పనులు నిర్వహించినా గుర్రపుడెక్క అలాగే ఉండి సాగునీరు కిందకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు దీన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది ఈ నేపథ్యంలో రైతులు బాడిగ సాయిబాబు, ఈడ్పుగంటి నరసింహారావు, తూము వెంకన్న ఈడే శ్రీను, దండమూడి మురళీకృష్ణ కానూరి శేషగిరిరావు, తదితరులు బుధవారం శ్రమదానం చేసి కాల్వను బాగుచేసుకున్నారు కౌతవరం నుంచి వేమవరం వద్ద మురుగుకాల్వలో కలిసే వరకు 2 కి మీ మేర కాల్వలో గుర్రపుడెక్కను తొలగించుకున్నారు

## దుస్థితిలో యడ్లకోడు కాల్వ

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం పరిధిలోని యడ్లకోడు పంటకాల్వలో దట్టంగా తూడు, గుర్రపుడెక్క పట్టేసింది ఫలితంగా సాగునీరు రాక రైతులు అవస్థలు పడుతున్నారు ఈ కాల్వను నీరు-చెట్టు పథకం కింద పొక్లెయిన్‌తో తవ్వారని పనుల పరిస్థితి ఇలా ఉందని రైతులు విమర్శిస్తున్నారు కౌతవరం నుంచి ప్రారంభమయ్యే యడ్లకోడు కాల్వ కౌతవరం, బలరామపురం, వేమవరం గ్రామాల్లో ప్రవహిస్తూ 1000 ఎకరాలకు సాగునీరందిస్తుంది జూన్‌లో రూ 2 50 లక్షలు(మరో రెండు కాల్వలకు కలిపి) వ్యయంతో నీరు -చెట్టు కింద తవ్వకం చేశారు ప్రస్తుతం దట్టంగా గుర్రపుడెక్క పట్టేసింది ఈ మేరకు పలువురురైతులు అధికారులను కలసి డెక్క నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు దీనిపై నీరు-చెట్టు అధికారి ఫ్రాన్సిస్‌ను వివరణ కోరగా గుత్తేదారుడితో మాట్లాడి డెక్క నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు



చెక్‌పోస్టు వద్ద కాల్వ దుస్థితిని చూపుతున్న రైతులు

## కాల్వలకు వంతుల వారీగా సాగునీరు పంపిణీ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** సాగునీటి కొరతతో కాల్వలకు వంతుల వారీగా నీటి పంపిణీ నిర్వహిస్తున్నారు. తూర్పు కృష్ణాలో ప్రధానమైన కౌతవరం లాకుల నుంచి మూడు కాల్వలకు వంతులవారీ(వారాబందీ) విధానాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. వచ్చే కొద్దిపాటి నీటిని మూడు కాల్వలకు విడుదల చేస్తే ఎందులోనూ పూర్తి నీటి మట్టం లేక చివరి భూములకు వెళ్లదు. ఈ నేపథ్యంలో కౌతవరం లాకుల వద్ద వారాబందీ విధానాన్ని పాటిస్తున్నారు. ప్రస్తుతం లాకులకు 500 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. బంటుమిల్లి, పోల్‌రాజ్ కాల్వలకు నీటి సరఫరా నిలిపివేసి క్యాంప్‌బెల్‌కాల్వకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కాల్వ నిండుగా ప్రవహిస్తోంది. లాకుల నుంచి లీకేజీలతో పోల్‌రాజ్‌కాల్వకు 37, బంటుమిల్ల కాల్వకు 52 క్యూసెక్కుల నీరు మాత్రమే పారుతోంది. అధికారుల ఆదేశాలతో వారాబందీ అమలు చేస్తున్నామని లాకు సూపరింటెండెంట్ ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు.



సరఫరా నిలిపివేయడంతో అడుగంటి ఉన్న బంటుమిల్లి కాల్వ

## తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** రుణమాఫీ ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందని, దీనిపై పనికట్టుకుని ప్రతిపక్షాలు పసలేని దుష్ప్రచారం చేస్తున్నాయని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు మండలంలోని కౌతవరంలో బుధవారం రైతులకు రెండో విడత రుణమాఫీ ఉపశమన పత్రాలు పంపిణీ చేశారు కౌతవరం అభివృద్ధి మొత్తం తెదేపా హయాంలోనే జరిగిందన్నారు ఈ రెండేళ్లలో ₹ 1 05 కోట్ల ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేశామన్నారు ఈ సందర్భంగా 717 మంది రైతులకు పత్రాలను అందజేశారు కార్యక్రమంలో ఎంపీపీ విజయభారతి, జిల్లా పాల సమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, తెదేపా మండల అధ్యక్షులు కొసరాజు బాపయ్యచౌదరి, భాజపా ఎంఈఓ మాధవకుమార్ అధ్యక్షుడు వడ్లమూడి రవీంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మోహన్‌రావు, వైఎస్‌ఎంపీపీ మరీదు నాగలక్ష్మి, సర్పంచి పడమట సుజాత, తదితరులు పాల్గొన్నారు



పత్రాలు అందజేస్తున్న రావి, కొసరాజు తదితరులు

**అంగలూరు (గుడ్లవల్లేరు) :** మండలంలోని అంగలూరు, చినగొన్నూరు పంచాయతీల వద్ద గురువారం రైతులకు రుణమాఫీ ఉపశమన పత్రాలు అందజేయనున్నట్లు పామర్రు ఏడీఏ శశిబిందు తెలిపారు

**గుడివాడ, న్యూస్‌టుడే :** రైతు సంక్షేమమే తెదేపా ధ్యేయమని, పురపాలక సంఘం ప్రతిపక్ష నేత లింగం ప్రసాద్ పేర్కొన్నారు బుధవారం బేతవోలులోని శ్రీఆనందేశ్వర స్వామి వారి దేవస్థాన కల్యాణమండపంలో రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు 27,28,29వార్డుల పరిధిలో రెండు విడతల్లో 431మంది రైతులు ₹ 46 లక్షలు మేర లబ్ధిపొందుతున్నట్లు ఆయన వివరించారు మండల వ్యవసాయశాఖాధికారి రంగనాథ్‌బాబు, తెదేపా పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, కౌన్సిలర్లు శొంఠి రామకృష్ణ, లింగంశెట్టి నైనజ్యోత్స్న, ఆర్‌ఐ సురేశ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు అనంతరం 163మంది రైతులకు రుణమాఫీ ఉపశమన పత్రాలను అందజేశారు కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ఛైర్మన్ పోలాసి ఉమామహేశ్వరరావు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## నెలాఖరు నాటికి కాల్వలకు నీరు

**నందివాడ:** ఈ నెలాఖరు నాటికి ఖరీఫ్ సాగుకు కాల్వలకు నీరిస్తామని తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి) పేర్కొన్నారు నందివాడ, తమిరిశ గ్రామాల్లో రైతులకు రుణ ఉపశమన పత్రాల పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు తెదేపా మండల అధ్యక్షుడు ఆరెకపూడి రామశాస్త్రులు మాట్లాడుతూ అప్పుల ఊబిలో ఉన్న రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు ఎంపీడీఓ అధ్యక్షత వహించగా, ఏవో శ్యామల, తెదేపా నాయకులు సతీష్, అండగాల, నందివాడ, తమిరిశ సర్పంచులు తాడికొండ సుబ్బలక్ష్మి, తోట వెంకటేశ్వరరావు, పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న పీసీ ఛైర్మన్ గుత్తా చంటి

# సాగునీటి సమస్య పరిష్కరించండి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** పెడన నియోజకవర్గంలో 50 శాతమే నాట్లు పూర్తయ్యాయని, మరో వారం రోజులు నిరంతరాయంగా 900 క్యూసెక్కులకు తగ్గకుండా నీరిస్తేనే చివరి భూములకు సాగునీరు అందుతుందని, కృత్తివెన్ను మండలంలోని గ్రామాల్లో తాగునీటి చెరువులు కూడా నిండ లేదని పెడన ఎమ్మెల్యే కాగిత వెంకట్రావ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కౌతవరం లాకులను పరిశీలించారు. బంటుమిల్లి కాల్వలకు అడుగంటి నీరు సరఫరా జరుగుతుండటంపై ఆయన ఆవేదన చెందారు. నీటిపారుదల శాఖ సీఈ వైఎస్ సుధాకర్‌కు పరిస్థితిని వివరించారు. జూన్ చివరి వారంలో నారుమళ్లు, వెద పద్ధతిలో సాగు చేసినా నీరు లేక, వర్షాలు లేక ఎండిపోయాయని, నేడు సెంటు నారుమడి రూ.1000 పైబడి కొనాల్సి వస్తోందని, అయినా దొరకని స్థితి ఉందన్నారు. గత పది రోజులుగా సాగునీరు సరిపడా వస్తుంటే నాట్లు ఊపందుకున్నాయని, కానీ మళ్లీ రెండు రోజులుగా నీటి సరఫరా నిలిపివేశారని వెల్లడించారు. ఎస్‌ఈ సుధాకర్ మాట్లాడుతూ పులిచింతలలో 14 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేశామని, పట్టిసీమ నుంచి నిత్యం 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నామని, సాగునీటికి కొరతలేదని వెల్లడించారు. నీటి నిలుపుదలపై డీఈఈ తోట సత్యనారాయణపై, తాగునీటి చెరువులకు నీరు వెళ్లకపోవడంపై ఏఈఈలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు ప్రముఖులు శలపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఈ సుధాకర్‌తో చర్చిస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత

# మారిన రూపురేఖలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలో కౌతవరం రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకుంది. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనుల్లో భాగంగా దీనిని అభివృద్ధి



ఆధునికీకరించిన కౌతవరం రైల్వే స్టేషన్

చేశారు. గత నెలలో పనులు చేపట్టి పూర్తి చేశారు. గతంలో ప్లాట్‌ఫామ్‌పై సిమెంట్ రేకులతో షెడ్ ఉండేది. గాలికి రేకులు ఎగిరిపోయేవి. దీనికితోడు షెడ్ కిందకు ఉండి వెలుతురు లేకుండా పోయింది. ఆధునికీకరణ పనుల్లో భాగంగా పాత రేకులు తొలగించి షెడ్ ఎత్తు పెంచారు. సిమెంట్ రేకుల స్థానంలో అల్యూమినియం రేకులను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు కూర్చోవడానికి టైల్స్‌తో ప్లాట్‌ఫామ్ నిర్మించారు.

# కౌతవరం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్ టుడే : మండలంలోని కౌతవరం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నారు విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనుల్లో భాగంగా కౌతవరం స్టేషన్ ప్లాట్‌ఫారం పనులు నిర్వహిస్తున్నారు గతంలో ప్లాట్‌ఫారంపై సిమెంట్ రేకులతో షెడ్ ఉండేది అయితే గాలివానలకు రేకులు పగిలి రక్షణ కరవైంది అందులోనూ షెడ్ కిందకు ఉండి వెలుతురు లేకుండా పోయింది దీంతో నేడు పాత రేకులు తొలగించి గడ్డర్లతో నాలుగడుగుల మేర ఎత్తు పెంచారు వాటిపై అల్యూమినియం రేకులను ఏర్పాటు చేపట్టారు



గడ్డర్లతో ఎత్తు పెంచిన రైల్వేస్టేషన్

# రహదారి బాగుచేయరూ..

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చేవేంద్ర రహదారిలో ఊరికి కాస్త దూరంగా ఉంటుంది. పంచాయతీ కార్యాలయం పక్కనున్న మర్రిచెట్లు నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి ఆసుపత్రి వరకు దారుణంగా తయారైంది. 20 ఏళ్ల కిందట సినీనటుడు కైకాల సత్యనారాయణ ఎంపీగా ఉన్నప్పుడు తన స్వగ్రామమైన కౌతవరానికి చేసిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ డొంక రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. నాటి నుంచి దీనికి పైసా నిధులు ఖర్చు చేయలేదు. ఫలితంగా అధ్వానంగా మారింది. అడుగడుగున గోతులు, సగం కుంగిన రహదారితో ప్రయాణికులు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదిన్నర కిందట ఈ దారిలో పీహెచ్‌సీని నిర్మించారు. రహదారికి మరమ్మతులు మాత్రం చేయలేదు. దీంతో రోగులు ఆస్పత్రికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పీహెచ్‌సీకి వెళ్లే రహదారి దుస్థితి ఇది

# నిధులున్నా నీరసమే

- ఇనుప, చెక్కబల్లలపై వైద్యం
- కొత్తవరం పీహెచ్‌సీ దుస్థితి

**కొత్తవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** ఆ పీహెచ్‌సీలో అభివృద్ధి పనుల నిమిత్తం ₹ 1.60 లక్షల నిధులు ఉన్నాయి. కానీ అందులో రోగులకు పడుకోబెట్టి చికిత్స చేయడానికి ఒక్క బెడ్ కూడా లేదు. ఇనుప బల్లలు, చెక్క బల్లే మంచంగా చేసి రోగులకు వైద్యం అందించాల్సిన దుస్థితి మండలంలోని కొత్తవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొంది.

కొత్తవరం పీహెచ్‌సీని ₹ 40 లక్షల వ్యయంతో నిర్మించి 2015 జనవరి 25న ప్రారంభించారు. కొన్నేళ్లుగా ₹ 1.60 లక్షల అభివృద్ధి నిధులున్నాయి. అభివృద్ధి కమిటీని నెల కిందట ఏర్పాటు చేశారు. నాలుగు బెడ్ల ఆస్పత్రి స్థాయిగా ఉన్న ఇందులో రోగులు పడుకునేందుకు మంచాలు లేవు. అంతకు ముందున్నవి కొన్ని పాడైపోగా, రెండింటిని పాతాసుపత్రిలో ఆరోగ్య ఉపకేంద్రంగా మార్చి అక్కడే ఉంచేశారు. దీంతో కొత్త ఆసుపత్రిలో ఒక్క బెడ్ కూడా లేదు. రోగులు కూర్చునే రెండు పొడుగాటి ఇనుప బల్లల్ని ఒకటిగా కలిపి కట్టి దానిపై పాత చిరిగిన కొబ్బరిపీచును వేశారు. దాని పక్కనే పాతాసుత్రిలో నాడు రోగుల్ని పరీక్షించేందుకు వాడిన ఎత్తు చెక్కబల్ల(దాతల వితరణ)నే తెచ్చి దానిపై తెల్ల వస్త్రం వేసి మంచంగా వినియోగిస్తున్నారు. వీటిపై పడుకోవడానికి రోగులు భయపడుతుంటే కొందర్ని వరండాలోని సిమెంట్ చప్టాపై ఉంచి సెలైన్‌లు ఎక్కిస్తున్నారు. ఇప్పటికైనా నిధులను వినియోగించి రోగులకు సౌకర్యాలను కల్పించాలని పలువురు కోరుతున్నారు.



₹ 40 లక్షలతో నిర్మించిన కొత్తవరం పీహెచ్‌సీ





# చిట్టి చిలకమ్మా.. ఆకలేసిందా

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. కొందరు నారు పెంచేందుకు ధాన్యం చల్లారు. ఈ నేపథ్యంలో రామచిలుకలు పెద్దఎత్తున చేరి ధాన్యం గింజలను తింటూ కడుపు నింపుకుంటున్నాయి. మండలంలోని కొత్తవరం పొలాల్లో వాలిన చిలుకల గుంపు దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది.

- న్యూస్‌టుడే, గుడ్లవల్లేరు

# కౌతవరంలో విరాళాల సేకరణ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** ప్రాణాలను పణంగా పెట్టి దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికులకు ఏం చేసినా రుణం తీర్చుకోలేనిదని జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కౌతవరం గ్రామ యువత జవాన్ల సంక్షేమ నిధి కోసం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బాబూరావు ₹ 5 వేల నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కొల్లి నాని, యువత, విద్యార్థులు వడ్లమూడి వెంకట్, టైగర్ శ్రీను, కళ్లేపల్లి ఫణిసునీల్ రాజు, బడుగు కాకానిరావు, కూరాళ్ల మధన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న బాబూరావు, యువత

# భూసేకరణ నష్టపరిహారం పెంపు

**కౌతవరం(గుడ్లవల్లేరు):** ఎంఎస్‌కె రహదారి విస్తరణ కోసం భూసేకరణ ద్వారా రైతులకు చెల్లించనున్న పరిహారాన్ని ప్రభుత్వం పెంచినట్లు తహశీల్దార్ మధుసూదనరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో భూసేకరణలో బైపాస్ రహదారితో పొలాలు కోల్పోతున్న కౌతవరం రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన వెల్లడించారు. గతంలో ఎకరానికి ₹ 6 లక్షలు ఉన్న విలువను ప్రభుత్వం ₹ 8 లక్షలకు పెంచిందని, దీనికి 1.25 పరిహారంతో కలిపి ₹ 10 లక్షలు అవతుందన్నారు. గతంలో ఇది కేవలం ₹ 7.50 లక్షలుగానే ఉండేదన్నారు. ₹ 10 లక్షల మొత్తానికి పోతున్న పొలం విస్తీర్ణాన్ని బట్టి 100 శాతం అదనపు పరిహారం అందిస్తారని వెల్లడించారు. అయితే రైతులు ఈ పరిహారం పెంపుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది మార్కెట్ విలువ కంటే ఎంతో తక్కువని, దీనికి అంగీకరించమని వెళ్లిపోయారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఉదయ్, డీటీ కనకదుర్గ, రైతులు పాల్గొన్నారు.

# నాట్లు పూర్తయ్యే దాకా నీటి సరఫరా

**గుడ్లవల్లేరు :** కృష్ణాడెల్టాలో 50 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని, మిగిలిన 50 శాతం కూడా నాట్లు పూర్తయ్యే వరకు నీటిని సరఫరా చేస్తామని కృష్ణాడెల్టా, పులిచింతల ఇరిగేషన్ సీఈ సుధాకర్ తెలిపారు. గుడ్లవల్లేరు ఇరిగేషన్ డివిజన్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. క్యాంప్‌బెల్, పోల్‌రాజ్, బంటుమిల్లి లాకులకు పంపిణీ జరుగుతున్న నీటి వివరాలు, లోయర్ పుల్లేరుకు ఎంత నీరు అవసరం అనేవిషయమై ఇరిగేషన్ అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా డెల్టాకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. పులిచింతలకు 16 టీఎంసీలు రాగా, 8 టీఎంసీల నీటిని దిగువకు ఇచ్చేశామన్నారు. ప్రస్తుతం పులిచింతలలో 7.5 టీఎంసీల నీరు నిల్వ ఉంచామని ఆయన చెప్పారు. పైనుంచి గత రెండురోజులుగా నీరు రావడం ఆగిపోయిందని చెప్పారు. వర్షాలు పడితే పులిచింతల నీరు విడు దల చేయడం ఆపేస్తామన్నారు. పట్టిసీమ నీరు మాత్రం వస్తుందని ఆయన చెప్పారు. వర్షాభావం ఉంటే శ్రీశైలం నుంచి నీరు అడుగుతున్నామని, అవి వస్తే కృష్ణాడెల్టాకు ఎటువంటి నీటి ఎద్దడి ఉండదని ఆయనచెప్పారు. డెల్టాలో ప్రస్తుతం 11 లక్షల ఎకరాలు సాగు జరగాల్సి ఉందని, అందులో 50 శాతం పూర్తయిందని, మిగతాది కూడా పూర్తయిపోతుందని ఆయన చెప్పారు. లోయర్‌పుల్లే, గుడ్లవల్లేరు లాకుల వద్ద 1300 నుంచి 1600 క్యూసెక్కుల వరకు హెడ్ మెయిం టెన్స్ అయితే క్యాంప్‌బెల్, పోల్‌రాజ్, బంటుమిల్లి కెనాల్‌లకు సమృద్ధిగా నీరు ఇవ్వవచ్చన్నారు. చిన్ని చిన్న ఇబ్బందులు ఉన్నచోట వాటిని పూర్తిచేసి ఒకటి రెండు రోజులలో దిగువ ప్రాంతానికి నీటి సమస్య లేకుండా పూర్తిచేస్తామని సీఈ సుధాకర్ చెప్పారు. ఇరిగేషన్ ఈఈ మోహన్‌రావు, డీఈ సి.వి.సత్యనారాయణ, లాక్ సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, ఏఈ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు లాకుల వద్ద ఇరిగేషన్ సీఈ సుధాకర్‌కు నీటి విడుదల తీరును వివరిస్తున్న డీఈ సి.వి. సత్యనారాయణ

ఆంధ్రజ్యోతి Sat, 27 August 2016
epaper.andhrajyothy.com/c/12765114

## సురక్షితం.. సులభతరం



మాట్లాడుతున్న ఆర్డీవో చక్రపాణి

**గ్రామీణ గుడివాడ, న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరూ నగదు రహిత చెల్లింపులు జరిపేలా తమ పాత పద్ధతులు మార్చుకోవాలని, నగదు రహిత చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్డీవో చక్రపాణి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నగదు రహిత చెల్లింపులపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నగదు రహిత చెల్లింపులు ఎంతో సురక్షితం, సులభరమన్నారు. ఆధార్‌కార్డు నంబరుతో వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, తహశీల్దార్ రెహ్మాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాల్వలకు నీరు విడుదల

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** తూర్పు కృష్ణాలో ప్రధానమైన కౌతవరం లాకులకు గురువారం నీరు చేరింది. తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం కేఈ కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేసింది. జనవరి 10తో పుల్లేరుకు సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లోని తాగునీటి చెరువులకు నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా చెరువుల్లో నీటి నిల్వలను ఉంచాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పుల్లేరుకు నీటిని విడుదల చేసింది. గురువారం కౌతవరం లాకులకు 400 క్యూసెక్కుల నీరు చేరింది. వీటిని బంటుమిల్లి కాల్వకు 30, పోల్‌రాజ్‌కు 207, క్యాంప్‌బెల్ కాల్వకు 125 క్యూసెక్కుల వంతున విడుదల చేశారు.



క్యాంప్‌బెల్ లాకుల నుంచి నీటి పరవళ్లు

# కాల్వల నిండుగా నీరు

## రైతుల కళ్లల్లో ఆనందం

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** తూర్పు కృష్ణాలో ప్రధానమై 2 50 లక్షల ఎకరాలకు సాగునీరందించే పుల్లేరు కాల్వ కౌతవరం లాకులు నీటితో కళకళలాడుతున్నాయి సోమవారం బ్యారేజీ వద్ద నీటిని విడుదల చేయగా మంగళవారం సాయంత్రం, బుధవారం నుంచే పుల్లేరు కాల్వ నిండుగా మారింది గురువారం కౌతవరం లాకులకు 800 క్యూసెక్కుల నీరు చేరింది ఈ నేపథ్యంలో బంటుమిల్లి కాల్వకు 218, పోల్‌రాజ్‌కు 228, క్యాంప్‌బెల్‌కు 10 క్యూసెక్కుల(బాలుడు గల్లంతు కారణంగా నీటిని నిలిపివేశారు) నీటిని విడుదల చేశారు దీంతో కౌతవరం లాకుల పరిధిలోని 1 60 లక్షల ఎకరాల సాగుకు వీలుగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు కాల్వలకు నీరు వదిలిన తొలి రోజే ఇంత పెద్దఎత్తున నీటిని ఈ మూడు కాల్వలకు విడుదల చేయడం ఇదే తొలిసారని లాకు సూపరింటెండెంట్ ఎస్ పవన్‌కుమార్ వెల్లడించారు కాల్వలకు భారీగా నీరు రావడంతో రైతులు, స్థానికులు, పరిసర గ్రామస్థులు పెద్ద సంఖ్యలో లాకులకు వచ్చి చూసి వెళ్తున్నారు



మూడు ఖానాలు నిండుగా ప్రవహిస్తున్న బంటుమిల్లి కాల్వ

# కౌతవరం లాకులకు భారీగా సాగునీరు





కౌతవరం లాకుల వద్ద లస్కర్లతో షట్టర్లు ఎత్తిస్తున్న సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, క్యాంప్‌బెల్ లాకుల నుంచి నీటి పరవళ్లు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** తూర్పుకృష్ణాలో ముఖ్యమైన కౌతవరం లాకులకు భారీగా సాగునీరు చేరింది. గత రెండేళ్లలో ఇంత పెద్దఎత్తున సాగునీరు రావడం కౌతవరం లాకుల చరిత్రలో ఇదే మొదటిసారి కావడం విశేషం. కాల్వల్లో నీటి ప్రవాహం కొరత, నీటి ఎద్దడిపై ఈ వారంలో రెండు పర్యాయాలు సాక్షాత్తూ రాష్ట్రవైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ రావడం కూడా ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం లాకులకు 1600 క్యూసెక్కుల నీరు రాగా సాయంత్రానికి మరింత పెరిగి 1800 క్యూసెక్కులకు పెరగడం విశేషం. దీంతో బంటుమిల్లి కాల్వకు ఉదయం 503 క్యూసెక్కుల నుంచి సాయంత్రం 715 క్యూసెక్కులకు నీటి సరఫరా పెంచారు. అలాగే పోల్‌రాజ్ కాల్వకు 512 క్యూసెక్కులు, క్యాంప్‌బెల్ కాల్వకు 408 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జులై 20న కాల్వలకు సాగునీరు రాగా ఆది నుంచి బంటుమిల్లి, పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ కాల్వలకు 50 నుంచి 250 క్యూసెక్కుల మించి నీటిని విడుదల చేయలేదు. ఆదివారం ఒక్కసారిగా 3-5 రెట్లు నీటి సరఫరా పెరగడం గమనార్హం. లాకు సూపరింటెండెంట్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రానికే లాకులకు నీటి సరఫరా పెరిగిందని, రెండేళ్లలో ఇంత పెద్దఎత్తున మూడు కాల్వలకు నీటి సరఫరా చేయడం ఇదే తొలిసారన్నారు.



లాకుల వద్దే నీటి సరఫరా లేక అడుగుబాగం కన్పిస్తున్న క్యాంప్‌బెల్ కాల్వ

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం ప్రధాన లాకుల నుంచి క్యాంప్‌బెల్ కాల్వకు సాగునీటి సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు ఈ నెల 20న లాకులకు బ్యారేజీ నుంచి నీరు రాగా బంటుమిల్లి, పోల్‌రాజ్ కాల్వకు నీటిని విడుదల చేస్తున్నారు అదే రోజు క్యాంప్‌బెల్ కాల్వకు నీటిని విడుదల చేయగా బాలుడు కాల్వలో పడి గల్లంతు కావడంతో నీటి సరఫరా నిలిపివేశారు ఇలా ఐదు రోజులుగా ఈ కాల్వకు నీటిని ఆపివేశారు ఈ కాల్వ పరిధిలోనూ నారుమళ్లు నాట్లు ఉన్నా అధికారులు స్పందించడం లేదు ఆదివారం బంటుమిల్లి కాల్వకు 224, పోల్‌రాజ్‌కు 186 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు క్యాంప్‌బెల్‌కు నీరు విడుదలపై పై అధికారుల నుంచి ఆదేశాలు లేవని లాకు సూపరింటెండెంట్ పవన్‌కుమార్ వెల్లడించారు

# చెత్త నిల్వ కేంద్రాలుగా.. నీటి సరఫరా లాకులు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** తూర్పు కృష్ణాలో సాగునీటి సరఫరాలో కీలకమైన కౌతవరం లాకులు అత్యంత దయనీయ దుస్థితికి చేరుకున్నాయి 1 40 లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కౌతవరం లాకులు చెత్తచెదారాలకు నిలయంగా మారాయి కౌతవరం లాకుల నుంచి పోలరాజ్ కాల్వ(52 వేల ఎకరాలు), క్యాంప్‌బెల్ కాల్వ(48 వేల ఎకరాలు), బంటుమిల్లి కాల్వ(60 వేల ఎకరాలు)ల ద్వారా



చెత్తాచెదారంతో నిండిన కౌతవరం లాకులు

సాగునీటి క్రమబద్ధీకరణ జరుగుతోంది అయితే ఈ లాకుల నిర్వహణకు అధికార సిబ్బంది ఉన్నా, ఈ లాకులు చెత్తాచెదారంతో నిండిపోయాయి పక్కనే ఉన్న పలు దుకాణాల, గృహస్థుల చెత్త, వృథా వస్తువులను మొత్తం తెచ్చి ఈ లాకుల్లోనే పోస్తున్నారు గుర్రపు డెక్కకు తోడు ఈ చెత్త కూడా నిండిపోయి అసహ్యాకరంగా మారింది ఇప్పటికైనా తాగు, నీటి సరఫరా కేంద్రమైన లాకులను పరిశుభ్రంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు



అధ్వానంగా ఉన్న పోల్‌రాజ్ కాల్వ లాకులు

# కౌతవరం అభివృద్ధికి నిధులు

## పంచాయతీరాజ్‌శాఖ నుంచి ₹ 50 లక్షల మంజూరు



₹ 20 లక్షలో అభివృద్ధి చేయనున్న శ్మశానాల రహదారి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని మేజర్ పంచాయతీల్లో రెండోదైన కౌతవరం గ్రామానికి మహర్దశ పట్టింది. ఒకేసారి ₹ 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రముఖ సినీనటుడు కైకాల సత్యనారాయణ కృషితో ఈ నిధులు విడుదల కావడం విశేషం. తన స్వగ్రామాభివృద్ధికి ఆయన చొరవ తీసుకోవడాన్ని గ్రామస్థులు అభినందిస్తున్నారు. మేజర్ పంచాయతీ కావడంతో కౌతవరంలో అంతర్గత రహదారులు, కాలనీలు, ఎస్సీవాడలు అధికం. జడ్పీ, పంచాయతీ, ఉపాధి నిధులు ఎన్ని వస్తున్నా ఇంకా రహదారుల అభివృద్ధి మందగమనంలోనే ఉంది. దీంతో స్థానిక తెదేపా నేతలు గ్రామానికి చెందిన సినీనటుడు కైకాల సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పంచాయతీరాజ్‌శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును కలసి తన గ్రామానికి నిధులు ఇవ్వాలని కోరడంతో సమ్మతించారు. ఒకేసారి పంచాయతీరాజ్‌శాఖ నుంచి నేరుగా ₹ 50 లక్షల నిధులను మంజూరు చేశారు. అందుకు సంబంధించి స్థానిక తెదేపా నేతలైన జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యంచౌదరిలు గ్రామానికి నిధులు కావాల్సిన రోడ్ల వివరాలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు ద్వారా పంచాయతీరాజ్ శాఖకు పంపడంతో సాంకేతిక, పరిపాలనామోదం లభించింది. దీంతో నిధులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సుబ్రహ్మణ్యంచౌదరి వెల్లడించారు. టెండర్లు కూడా పూర్తయ్యాయని వివరించారు.



గ్రామస్థులతో చర్చిస్తున్న సినీనటుడు సత్యనారాయణ (దాచిన చిత్రం)

★ పంచాయతీ కార్యాలయం పక్క నుంచి బంటుమిల్లి కాల్వకు వెళ్లే శ్మశానాల రహదారికి ₹ 20 లక్షలు ★ చిన ఎస్సీవాడలో రహదారికి ₹ 5 లక్షలు ★ ఎస్టీ కాలనీలో వంతెన నిర్మాణానికి ₹ 4 లక్షలు ★ పెద ఎస్సీవాడలో రహదారికి ₹ 4 లక్షలు ★ రామకోటి ఆలయం నుంచి గ్రంథాలయం వరకు రహదారి నిర్మాణానికి ₹ 5లక్షలు ★ గాలిగోపురం ఎదురు రహదారికి ₹ 5 లక్షలు ★ కైకాల సొంత వీధికి ₹ 4 లక్షలు ★ ఆరోగ్య ఉపకేంద్రం ఎదురురోడ్డుకు ₹ 3 లక్షల వంతున నిధులను కేటాయించారు.

# క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహాలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** గ్రామీణ క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహకాలు అందజేస్తున్నాయని జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కౌతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మండల స్థాయి ఖేలో క్రీడల పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక వ్యాయామమే కాక, మానసిక ఉల్లాసంతో చదువుకోగలుగుతారని తెలిపారు. తొలుత పలు క్రీడల కోర్టులను పుష్పావతి, ఎంపీపీ కొసరాజు విజయభారతి, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, సర్పంచి పడమట సుజాత, ఎంఈవో విశ్వమోహన్, క్రీడాకారుడు నాగయ్యలు ప్రారంభించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని క్రీడల్లో పోటీపడ్డారు. కార్యక్రమంలో సూర్యప్రసాదరావు, కొసరాజు బాబ్జి, నాంచారయ్య, ప్రధానోపాధ్యాయిని విజయకుమారి, పీడీ ఇమ్మడి వెంకటనారాయణ, సీఆర్పీలు రాజేష్ పాల్గొన్నారు.



**క్రీడాకోర్టులను ప్రారంభిస్తున్న పుష్పావతి, ఎంపీపీ**

# ఆచరణీయం..

## కందిసాగులో ఆదర్శంగా నిలుస్

**నాడు:** పొలం గట్లు... ఇవి కేవలం పచ్చగడ్డి పెంచుకోవడానికి తప్ప వేరే రకంగా ఉపయోగపడవని రైతులు వీటిపై శ్రద్ధ చూపేవారు కాదు.

**నేడు:** రైతులు మారారు. వారు ఆదాయ వనరులపై దృష్టి సారిస్తున్నారు. నిన్నటి వరకు శ్రద్ధ చూపని పొలం గట్లను ఉపయోగించుకుంటూ పలు రకాల పంటలను సాగు చేస్తూ.. ఆదాయం తీస్తున్నారు.వారు ఎవరు..? ఎక్కడ..? ఆ వివరాలపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం.

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

**ప్రభుత్వం లక్ష్యం:** అమరావతి ప్రాంతంలో వాణిజ్య పంటల సాగు తగ్గుతోందని..ప్రభుత్వం వృథాగా ఉంటున్న పొలం గట్లనుసైతం సద్వినియోగం చేయాలని సంకల్పించింది. రైతులకు వారికున్న విస్తీర్ణాన్ని బట్టి రెండు నెలల కిందట కంది విత్తనాలను తొలిసారిగా ఉచితంగా సరఫరా చేసింది.



వరి చేల గట్లపై ఏపుగా పెరిగిన కంది మొక్కలు

**పలువురు పప్పుగా:** గ్లువల్లేరు మండలంలో 400 కిలోలు కంది విత్తనాలు ఇచ్చారు. అయితే ఉచితంగా ఇచ్చిన ఆ విత్తనాలను చాలా మంది రైతులు ఇంట్లో పప్పుగా వినియోగించుకున్నారు. దీనితో లక్ష్యం నీరుగారిపోయింది.



కంది పంటను పరిశీలించిన ఏవో రమాదేవితో రైతులు(పాతచిత్రం)

**క్రైతవరం రైతులు:** గ్రామంలో పది మంది రైతులు తమ పొలాల గట్లపై వాటిని చల్లారు. నేడు కంది మొక్కలు ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంది. మరో రెండు నెలల్లో పంట చేతికి రానుంది. దానికి తెగుళ్లు సోకకుండా చర్యలు తీసుకున్నారు.

# కౌతవరానికి కలంకారీ కళ

## బంటుమిల్లి కాల్వను ఆశ్రయించిన కార్మికులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** పెడన.. కలంకారీకి ప్రసిద్ధి చెందింది. రకరకాల డిజైన్లలో సహజసిద్ధ రంగులతో తయారు చేసే దీనికి అంతర్జాతీయంగా ఎంతో పేరు ఉంది. దీనికి పెడనే కేంద్రం. ఇక్కడి కార్మికులు ఈ రంగులు ముద్రించిన దస్తులను నీళ్లలో చాలా సేపు నానన్నారు. దీంతో నిత్యం నీటితో కళకళలాడే కౌతవరం బంటుమిల్లి కాల్వకు పెడన కలంకారీ కార్మికులు చేరుకుంటున్నారు. ఉదయాన్నే చేవేంద్ర రోడ్డు నుంచి నేరుగా శ్మశానం దారిగా బంటుమిల్లి కాల్వకు వ్యాన్‌లు, ఆటోల్లో వస్త్రాలను తీసుకువచ్చి ఈ కాల్వలో నీటిలో నానబెట్టి, ఉతికి గట్టున





బంటుమిల్లి కాల్వలో దుస్తులు నానబెడుతున్న కార్మికులు, కాల్వ గట్టున దుస్తులు ఆరబెడుతూ..

బెట్టి ఆరబెడితేనే కలంకారీ వస్త్రానికి నాణ్యమైన రంగు, తుది రూపు వస్తుంది. అంటే మొత్తం ప్రక్రియలో నీరే కీలకపాత్ర. పెడన మధ్యగా ప్రవహించే రామరాజు కాల్వలోనే పెడన నేతకార్మికులంగా ఈ వస్త్రాలను ఉతికి ఆరబెట్టుకుంటుంటారు. నేడు గత కొన్ని నెలలుగా ఈ కాల్వలో నీటి సరఫరా సరిగా, పూర్తి స్థాయిలో లేక ఇబ్బందులు పడుతు ఆరబెట్టుకుని తిరిగి మడత పెట్టుకుని పెడనకు తరలించుకుంటున్నారు. ప్రయాణ ఖర్చులు, కాలాతీతం అవుతున్నా నీటి వనరుల లభ్యతలో కొరతతో నేడు.. పెడన కలంకారీ కౌతవరానికి చేరుకుంది. నదులు పక్కనే నాగరికతలు పెరిగినట్లు ఎక్కడ నీరు ఉంటే అక్కడే 'కళ'కళలాడుతుందనడానికి ఇదే ఉదాహరణ.

# దాహం తీర్చండి మహాప్రభో...

★ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ప్రజల వేడుకోలు

★ నీటిపారుదల కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు

**కౌతవరం(గుడ్లవల్లేరు),న్యూస్‌టుడే:** తమ గ్రామాలకు తాగు నీరు ఇవ్వాలని కోరుతూ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల గ్రామస్థులు వేడుకున్నారు. రైతులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు శనివారం మండలంలోని కౌతవరం నీటిపారుదల సబ్‌డివిజన్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. శివారు గ్రామాలకు కాల్వల ద్వారా నీరు చేరలేదని, గ్రామస్థుల దాహార్తిని తీర్చే మంచినీరు వాడుక చెరువులకు వచ్చేలా కాల్వలకు నీటి సరఫరా పెంచాలని కోరారు. ఈ మేరకు డీఈఈ సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ రెండు మండలాలకు నీరిచ్చే బంటుమిల్లి కాల్వకు నీటి సరఫరా పెంచామని ఆయన వెల్లడించారు.

# రెండేళ్లలో అన్నిచోట్లా సిమెంటు రహదారులు

**పెంజెంద్ర, కౌతవరం(గుడ్లవల్లేరు):** రానున్న రెండేళ్లలో జిల్లాలోని రోడ్లన్నీ సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెంజెంద్ర, కూరాడ, కౌతవరం గ్రామాల్లో రూ.1.01 కోట్ల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. గత రెండేళ్లుగా జిల్లాలో సగం రోడ్లను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశామని, మిగిలిన రోడ్లను కూడా సిమెంట్ రోడ్లుగా మార్పు చేస్తామన్నారు. దీంతో తర్వాత పంచాయతీలకు వచ్చే స్థానిక, కేంద్ర, రాష్ట్ర నిధులతో సమగ్రాభివృద్ధిని, స్వయం అభివృద్ధిని పల్లెలు సాధించుకోగలవన్నారు. ఈ పెంజెంద్ర-చిత్రం రూ. 20 లక్షల రహదారి, కూరాడలో రూ. 5 లక్షలతో, కౌతవరంలో రూ. 48 లక్షలతో వేసిన 6 సిమెంట్ రోడ్లను, రూ. 18 లక్షలతో నిర్మించిన రెండు అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి, ఎంపీపీ కొసరాజు విజయభారతి, సర్పంచిలు బొప్పన పద్మజ, పడమట సుజాత, గోపి సీతకుమారి తదితరులు పాల్గొన్నారు.




కౌతవరం: సిమెంట్ రహదారిని ప్రారంభిస్తున్న అనూరాధ

**ప్రతి పథకం ప్రజలకు చేరువ కావాల్సిందే**

కౌతవరం(గుడ్లవల్లేరు): ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకం ప్రజలకు చేరువ కావాల్సిందేనని, దీనికి ప్రచార బాధ్యతను పార్టీ శ్రేణులు భుజానకెత్తుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కౌతవరంలో నిర్వహించిన జనచైతన్య యాత్రలో భాగంగా ఎన్టీఆర్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, స్వచ్ఛాంధ్ర మిషన్ వైస్ ఛైర్మన్ డాక్టర్ సీఎల్ వెంకటరావులు మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు, పీసీ ఛైర్మన్ గుత్తా చంటి, జడ్పీ ఉపాధ్యక్షురాలు పుష్పావతి, ఎంపీపీ విజయభారతి, వైస్‌ఎంపీపీ మరీదు నాగలక్ష్మీ, ఎంపీటీసీ యార్లగడ్డ వెంకన్న, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, మండల పార్టీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, స్థానిక నేతలు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, కానూరి సత్యంబాబు, చిట్టిబాబు, జగన్మోహన్‌రావు, వద్ధమూడి దేశ్‌పతి, విన్నకోట పాములు, మేకా అమలేశ్వరరావు, సమ్మెట నాగయ్య, మత్తి నాగన్న, కోళ్లపల్లి శేఖర్, పరసా పోతురాజు, బొబ్బా నరసింహారావు, చిట్టిబొమ్మ నరసింహారావు, సత్యనారాయణ, కాటూరి గంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కౌతవరంలో ఎల్వీప్రసాద్ నేత్రవైద్యశాల

## అధునాతన 25 పడకల ఆస్పత్రి ఏర్పాటు ★ వెల్లడించిన నిర్మాణదాత జగదీష్ ప్రసాద్

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరంలో ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నట్లు గ్రామవాసి, ఆంధ్రజ్యోతి పూర్వ ఎండీ కానూరి జగదీష్‌ప్రసాద్ 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు స్థానిక శ్రీకానూరి దామోదరయ్య జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల వజ్రోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఈ మేరకు వివరాలను సోమవారం 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి అధినేతలతో తనకున్న సాన్నిహిత్యం దృష్ట్యా పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన కౌతవరంలో అధునాతన సౌకర్యాలతో నేత్ర వైద్యశాల ఏర్పాటును వారికి వివరించగా సమ్మతించారన్నారు మండల కేంద్రానికి దగ్గరలో విశాలమైన మూడెకరాల స్థలం ఉందని, భవన నిర్మాణాలు తమ కుటుంబ సభ్యులే చేపడతారని వారికి వివరించగా అంగీకరించినట్లు తెలిపారు ప్రాథమికంగా ఆ స్థలాలు వారికి చూపి పూర్తిస్థాయి పనులకు రంగం సిద్ధం చేస్తామని వెల్లడించారు ఈ ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా, మిగిలినవారికి నిర్ణీత రుసుంలు ఆసుపత్రి నిబంధనల మేరకు ఉంటాయని వివరించారు కార్యక్రమంలో జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, శ్రీషిర్డీసాయి సేవా ట్రస్ట్ ఛైర్మన్ కానూరి బాలు, వైద్యులు జమ్ముల రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు



గ్రామస్థులతో మాట్లాడుతున్న కానూరి జగదీష్ ప్రసాద్

# కృష్ణాలో గోదావరి జలాల ప్రయాణం

## నేటి నుంచి పట్టిసీమలో 12 పంపుల ద్వారా నీరు తోడకం



బంటుమిల్లి కాల్వ నీటి సరఫరాను పరిశీలిస్తున్న పీసీ ఛైర్మన్ గుత్తా చంటి

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణా డెల్టాలో 300 కి మీ మేర ప్రయాణించి రైతుల ఆశల్ని సజీవం చేశాయని తూర్పు కృష్ణా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి) పేర్కొన్నారు ఆదివారం ఆయన తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు చాపరాల రాజేశ్వరరావుతో కలసి కౌతవరం లాకుల వద్ద కాల్వలకు విడుదలవుతున్న సాగునీటిని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టిసీమ నుంచి బ్యారేజ్‌కు 185 కి మీ అక్కడి నుంచి కృతివెన్ను వరకు 115 కి మీ మేర మొత్తం 300 కి మీ గోదావరి జలాలు ప్రయాణించాయన్నారు ఈ నీళ్లతో సాగు ఊపందుకుని పొలాలు సస్యశ్యామలం అవుతున్నాయని పేర్కొన్నారు గోదావరి జిల్లాల్లోని గ్రామాల్లో కాటన్‌దొర విగ్రహాలు, ఇళ్లలో చిత్రపటాలు ఉన్నాయని, అదేరీతిలో రేపటి రోజున కృష్ణాలో రైతులు చంద్రబాబు చిత్రపటాలు ఏర్పాటు చేసుంటారన్నారు ప్రస్తుతం బ్యారేజీ నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు పట్టిసీమ ద్వారా సోమవారం 12 పంపుల నుంచి నీటి తోడకం చేపడతారన్నారు కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి శశి పాల్గొన్నారు



సైనిక సహాయ నిధి విరాళాల మొత్తాన్ని
సిండికేట్ బ్యాంక్ మేనేజర్‌కు అందజేస్తున్న కొల్లి నాన్జీ తదితరులు

# సైనిక సహాయ నిధికి విరాళం

**గుడ్లవల్లేరు** : కౌతవరంలో మణిశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొల్లి నాన్జి, యువత సారథ్యంలో సైనిక నిధికి విరాళాలు సేకరించారు. వివరాళాలు మొత్తం రూ. 50,116 లను సిండికేట్ బ్యాంక్‌లో సైనిక సహాయ నిధి ఖాతాకు జమచేశారు. విరాళాలు అందించిన కౌతవరం గ్రామస్థులకు నిర్వాహ కులు కృతజ్ఞతలు తెలిపారు. కొల్లి నాన్జి, వెంకట్, సునీల్ దాస్, శ్రీను, కాకాని, మభీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Sun, 30 October 2016
epaper.andhrajyothy.com//c/14314676

## నేత్ర వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు గంగరాజు

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే:** స్థానిక లయన్స్ సేవా భవన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు గంగరాజు సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో ఐదుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారిని గుడివాడ ఆస్పత్రికి తరలించారు. కొల్లి రాజేశ్ వితరణతో వైద్యసేవలు పర్యవేక్షించారు. లయన్స్ అధ్యక్ష, కార్యదర్శులు పోలవరపు వెంకట్రావ్, ఘంటా చంద్రశేఖరరావు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, అన్నే రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కౌతవరంలో జెండా పండుగ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం ఒకటో వార్డులోని మీనార్ మసీదులో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జండా పండుగ నిర్వహించారు. మహబూబ్ సుభానీ గ్యార్మీ జండా పండుగ పేరిట దీనిని యువకులు నిర్వహిస్తున్నారు. మసీదులోని జండాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక జండా దిమ్మె వద్ద ఉంచి పూజాదికాలు చేసి మిఠాయిలు, చందనం సమర్పించారు. అనంతరం వాటిని పంపిణీ చేశారు.



పూజలు చేస్తున్న ముస్లింలు

## కింద ప్రవాహం.. పైన నిర్మాణం



బంటుమిల్లి కాల్వలో కింద నీరు ప్రవహిస్తుండగా పైన నిర్మాణ పనులు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం ప్రధాన లాకుల నుంచి ప్రవహించే మూడు బంటుమిల్లి, పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ కాల్వల్లో కొత్తగా హెడ్ రెగ్యులేటర్ నిర్మాణాలు చేశారు. వీటిల్లో పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ నిర్మాణాలు పూర్తికాగా బంటుమిల్లి కాల్వలో జరుగుతున్నాయి. ప్రస్తుతం కాల్వలకు నీరు రావడంతో ఈ రెగ్యులేటర్ నిర్మాణం కూడా పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. ఈ రెగ్యులేటర్ కింద నుంచి నీరు ప్రవహిస్తుండగా, పైన కాంక్రీట్‌బాక్సుల నిర్మిస్తున్నారు

## విద్యార్థులకు టైలు, బెల్టుల వితరణ

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలో కౌతవరం స్పెషల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరిన వ్యక్తుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వైద్యులు జమ్ముల రామచంద్రరావు, యోగా గురువు కేఆర్పీలు మాట్లాడారు. ఓంసాయి సేవా సత్సంగ్ ద్వారా పాఠశాలకు గోడ గడియారాన్ని అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయిని శారద విద్యార్థులకు టైలు, బెల్టులు వితరణ చేశారు. హెచ్‌ఎం మోకా మాధవరావు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు



విద్యార్థులకు టైలు అందజేస్తున్న డాక్టర్ రామచంద్రరావు, పక్కన కేఆర్పీ, తదితరులు

కట
పుదల

# సహకార స్ఫూర్తి కోసమే వారోత్సవాలు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** ప్రజల్లో, రైతుల్లో సహకార స్ఫూర్తిని రగిలించేందుకే సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డివిజన్ సహకారశాఖ అధికారి సయ్యద్ మస్తాన్‌వలీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కౌతవరం సొసైటీలో సహకార వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 425 సొసైటీల్లో 14నుంచి 20 వరకూ ఈ వారోత్సవాలను చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని కౌతవరం, కోరుకొల్లు, విజయవాడ ప్రాంత సొసైటీల్లో అధికారికంగా వీటిని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. రైతులకు, సభ్యులకు, గ్రామస్థులకు సొసైటీల ద్వారా అందించే పథకాలు, లబ్ధిలను వివరించడానికే దీన్ని వేదికగా చేసుకుంటున్నట్లు తెలిపారు. తొలుత సొసైటీ జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ సహకార ఆడిటర్ జగన్మోహన్‌రావు, కేడీసీసీ మేనేజర్ వెంకటనారాయణ, జిల్లా పాల సమితి డైరెక్టర్ బాబూరావు, సొసైటీ అధ్యక్షులు చిట్టిబాబు, శ్రీను, నీటిసంఘాధ్యక్షులు సత్యంబాబు, సర్పంచి సుజాత, కార్యదర్శి వెంకట్రామయ్య, ఎండీ సాంబశివరావు, గ్రామప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ₹ 6.44 కోట్లతో 92 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం

## పంచాయతీరాజ్ ఈఈ అశోక్‌కుమార్

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో ₹ 6.44 కోట్ల వ్యయంతో 92 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఈఈ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కౌతవరం 1వ వార్డు, గుడ్లవల్లేరు జేమ్స్‌పేట ఐజాక్ ఆవరణలో ఒక్కొక్కటి ₹ 7 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలను, సంతలో ₹ 60 లక్షలతో నిర్మిస్తున్న నియోజకవర్గ రైతు శిక్షణ భవన నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, పెడన, కైకలూరు నియోజకవర్గాల్లో 92 భవనాలను నిర్మించాల్సి ఉండగా 82 నిర్మాణాలు ప్రారంభించామన్నారు. పదింటికి స్థలాలు లేవన్నారు. ₹ 7 లక్షల నిధులు చాలనందున ప్రస్తుతం హాల్ వరకూ సంపూర్ణంగా పూర్తి చేసి మిగతా గదులు ఫ్లోరింగ్ చేస్తామని వెల్లడించారు. మిగిలినవి స్థానిక సంస్థల నిధుల సౌలభ్యంతో పూర్తి చేసుకోవాలని సూచించారు. నాణ్యత, పనులతీరుపై డీఈఈ కోటేశ్వరరావు, ఏఈఈ నాగేశ్వరరావులకు సూచనలు చేశారు.



కౌతవరం ఒకటో వార్డులో అంగన్‌వాడీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ అశోక్‌కుమార్

## నిర్వాసిత రైతులతో సమావేశం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఎంఎన్‌కే రహదారి విస్తరణలో భాగంగా చేపట్టనున్న బైపాస్ రహదారి నిర్వాసిత రైతులతో రెవెన్యూ అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం వీరికి చెల్లించే నష్ట పరిహారంపై 50 మంది రైతులు కోర్టులో కేసు వేశారు. దీనిపై మండల రెవెన్యూ అధికారులు రైతులతో చర్చలు జరిపారు. ఎకరానికి అన్ని రకాల నష్టపరిహారాలు కలిపి ₹ 25 లక్షలు ఇస్తామని అధికారులు చెప్పగా, కుదరదని, కొత్త రికవరీ చట్టం ప్రకారం ఎకరానికి ₹ 50 లక్షల మేర చెల్లిస్తేనే తమకు సమ్మతని రైతులు స్పష్టం చేశారు. దీంతో సమావేశం సఫలం కాలేదు.

# వైభవంగా షిర్డీసాయి హోమాలు, పూర్ణాహుతి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం షిర్డీసాయి ఆలయంలో దశమ వార్షికోత్సవంలో భాగంగా చివరి రోజు సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బాబాకు ఆలయ అర్చకులు చావలి మల్లికార్జునశర్మ పూజాపర్యవేక్షణలో నిర్వాహకులు, భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. బాబాకు విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. అనంతరం మధుసూదనరావు దంపతులు, భాజాపా రాష్ట్ర కార్యదర్శి రామినేని వెంకటకృష్ణ దంపతులు ఉభయదాతలుగా శ్రీసాయిలక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి జరిపారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాకులు బొబ్బా ఝాన్సీరాణి, వడ్లమూడి వెంకటశైలజ, పద్మజ, సీతామహాలక్ష్మి, పడమట సుజాత, కళ్లేపల్లి సుధారాణి, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



శ్రీలక్ష్మీసాయిగణపతి హోమం, పూర్ణాహుతి నిర్వాహిస్తున్న ఉభయదాతలు, భక్తులు



బాబాకు పూజలు చేస్తున్న మహిళా నిర్వాహకులు, భక్తులు

# కౌతవరం శ్రీషిర్డీసాయి దశమ వార్షికోత్సవం

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని కౌతవరం శ్రీషిర్డీసాయి ఆలయంలో శనివారం దశమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబాకు 108 కలశాలతో ఫల పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బాబాకు స్వర్ణకచిత పుషాలంకరణ నిర్వహించారు. తదుపరి సామూహిక శ్రీసాయిసత్యవ్రతాలను జరిపారు. ఆస్ట్రేలియాకు చెందిన మొవ్వా శ్రీనివాస్-శిల్పి దంపతుల వితరణతో అన్నదానం నిర్వహించారు. రాత్రికి బాలాజీ భక్తసమాజం నిర్వహించిన అయ్యప్ప స్వరార్చన ఆకట్టుకుంది. ఏర్పాట్లను ఆలయ మహిళా నిర్వాహకులు బొబ్బా ఝాన్సీరాణి, వడ్లమూడి వెంకటశైలజ, పద్మజ, సీతామహాలక్ష్మి, పడమట సుజాత, కళ్లేపల్లి సుధారాణి, బొబ్బా రంగనాయకమ్మ, చాపరాల విజయలక్ష్మి, అడ్డుమిల్లి పద్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ నిర్వాహకులు





బాబాకు పండ్లముక్కలతో అభిషేకం చేస్తున్న ఉభయదాతలు ప్రసాద్, మధుసూదనరావు దంపతులు, ఒకటో వార్డులో పూజలు చేస్తున్న భక్తులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం షిర్డీసాయి ఆలయంలో దశమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలో నిర్మించి నిర్వహిస్తున్న ఆలయంగా ఇది ప్రసిద్ధి చెందింది. ఉదయం బాబాకు ఆలయ అర్చకులు చావలి మల్లికార్జునశర్మ పూజాపర్యవేక్షణలో పంచామృతాలతో, నవరకాల పండ్ల ముక్కలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బాబాకు స్వర్ణకచిత పుష్పాలంకరణ నిర్వహించారు. ట్రాక్టర్‌పై, మేళతాళాలతో కనుల పండువగా గ్రామోత్సవం చేశారు. వడ్లమూడి యుగంధర్ వెంకటకృష్ణారావు వితరణతో అన్నదానం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు బొబ్బా ఝాన్సీరాణి, వడ్లమూడి వెంకటశైలజ, పద్మజ, సీతామహాలక్ష్మి, పడమట సుజాత, కళ్లేపల్లి సుధారాణి, బొబ్బా రంగనాయకమ్మ, చాపరాల విజయలక్ష్మి, అడ్డుమిల్లి పద్మ, వీరంకి నాని తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కౌతవరం 1వ వార్డులోని శ్రీషిర్డీసాయి మందిర 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ నిర్మాణదాతలైన ఉపాధ్యాయ దంపతులు తుమ్మల శ్రీనివాసరావు-అడ్డుమిల్లి కనకదుర్గలు బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. స్థానికులైన అల్లు అప్పారావు-దుర్గ దంపతులు, మాజీ సర్పంచి పల్లెం నరసింహారావు, మాజీ ఎంపీటీసీ సమ్మెట వెంకటేశ్వరరావు, నక్కా మల్లేశ్, మురాల నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

## గౌతమేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా శంకర్రావు



నూతన కమిటీ సభ్యులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం శ్రీగౌతమేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్‌గా తూము శంకర్రావు, సభ్యులుగా ఈడే గంగాధరరావు, కానూరి రాజేంద్రప్రసాద్, మాతా వెంకటరంగసుబ్బయ్య, ఎం.సునీత, భాజపా నుంచి మండల అధ్యక్షులు వడ్లమూడి రవీంద్రబాబులు ప్రమాణస్వీకారం చేశారు. వీరిని జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి, ఎంపీపీ కొసరాజు విజయభారతి, పాలసమితి జిల్లా డైరెక్టర్ బాబూరావు, నీటి సంఘాధ్యక్షులు సత్యంబాబు, సొసైటీ అధ్యక్షులు సత్యంబాబు, నేతలు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యంచౌదరి, అమలేశ్వరరావు, పాములు, పోతురాజు, ఘంటయ్య అభినందించారు.



కౌతవరం-పద్మాలపాలెం: నిమజ్జన ఊరేగింపు,

# కృషితో పోలియో రహిత సమాజ స్థాపన



కొతవరంలో పోలియో చుక్కలు వేస్తున్న పీహెచ్‌సీ చైర్మన్ జగపతిరావు

## పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యం

**కౌతవరం(గుడ్లవల్లేరు):** పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు చేపడుతున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి ప్రజల నుంచి పూర్తి సహకారం కావాలని గుడ్లవల్లేరు పీహెచ్‌సీ ఛైర్మన్ చాపరాల రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోను పురస్కరించుకుని పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ఏఎన్ఎం, ఆశావర్కర్లు శనివారం అవగాహన ర్యాలీ చేశారు. వైద్యురాలు శివప్రీతి, సీహెచ్‌వో భాస్కరరావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కౌతవరం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, వైద్యులు సంఘమిత్ర, సుగుణావతి, సూపర్‌వైజర్ వెంకటాద్రిలు ఆస్పత్రి నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు.




కౌతవరంలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

### నేడు పల్స్‌పోలియో

**గుడ్లవల్లేరు:** మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు చెందిన 3342 మంది చిన్నారులకు ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంగా పోలియో చుక్కలు వేయన్నారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీ పరిధిలోని 6 సబ్‌సెంటర్‌ల ద్వారా 17 కేంద్రాలలో రెండు రూట్లలో 72 మంది వైద్యసిబ్బంది 1914 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు సీహెచ్‌వో భాస్కరరావు వెల్లడించారు. కౌతవరం పీహెచ్‌సీ పరిధిలోని 5 సబ్ సెంటర్‌ల ద్వారా 19 కేంద్రాల్లో రెండు రూట్లలో 76 మంది వైద్య సిబ్బంది 1428 మంది చిన్నారులకు చుక్కల మందు వేయనున్నట్లు సూపర్‌వైజర్ వెంకటాద్రి వెల్లడించారు.

**గుడివాడరూరల్:** గుడివాడ మండలంలో 3089 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు మండల వైద్యాధికారి సతీష్‌కుమార్ చెప్పారు. ఇందుకు 124 మంది సిబ్బందిని నియమించామన్నారు. 0-5 ఏళ్లలో లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

# కొత్తవరంలో పీర్ల ఊరేగింపు



పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరంలో ముస్లింలు పీర్ల ఊరేగింపు గురువారం నిర్వహించారు. స్థానిక పాత రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న పీర్ల దేవాలయం(ఆస్థాన్) నుంచి అలంకరించిన నూతన పీర్లను గ్రామమంతటా ఊరేగించారు. కార్యక్రమంలో పఠాన్ బషీర్‌ఖాన్ పఠాన్ ఇస్మాయిల్‌ఖాన్, బుడా, రహీంఖాన్, అఫీస్‌ఖాన్, రసూల్‌ఖాన్, మునీర్‌ఖాన్, పఠాన్ ఛాన్‌బాషా, అబ్దుల్ సలాం, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

**కౌతవరం, డోకిపర్రు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పవిత్ర మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని కౌతవరం 1వ వార్డు, చెక్‌పోస్టు, చెరువుగట్టు, వేమవరపాలెం, ఉలవలపూడి, నాగవరం, డోకిపర్రు-తురాయిపాలెం, మీర్‌అలీపాలెం, లంకాదొడ్డి, విన్నకోట-సుబ్బిచెర్వు, కట్టవానిచెర్వు, పెంజెండ్ర, అంగలూరు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి జెండాలను ఊరేగించారు.



కౌతవరంలో ప్రసంగిస్తున్న మత పెద్ద, హాజరైన ముస్లిం సోదరులు



నమాజ్ చేస్తున్న భక్తులు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. త్యాగానికి, దానానికి గుర్తుగా జరపుకునే ఈ పండుగ సందర్భంగా ఉదయాన్నే ముస్లింలు సంప్రదాయ దుస్తులు ధరించి మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎవరి మొక్కుబడుల కోసం వారు గొర్రె పోతులను అల్లాకు సమర్పించారు. కౌతవరం ఒకటో వార్డు, చెకెపోస్టు, ఈద్గా, చెరువుగట్టు, వేమవరపాలెం, నాగవరం, ఉలవలపూడి, బీమునిగుంట, సుబ్బిచెర్వు, కట్టవానిచెర్వు, అంగలూరు, పెంజెంద్ర, డోకిపర్రు, లంకాదొడ్డి గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. చిన్నారులు పరస్పరం అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**గుడివాడ:** మియాఖాన్ మసీదు, గుల్జార్‌మసీదు, నూర్ తదితర మసీదుల్లో మంగళవారం ప్రార్థనలు నిర్వహించారు. మియాఖాన్ మసీదు ఇమామ్ మాట్లాడుతూ జిల్‌హజ్ మాసంలో దైవప్రవక్త హజ్రత్ ఇబ్రహీం ప్రసన్నతకోసం మహోజ్వల త్యాగం చేసి పరిపూర్ణ విశ్వాసాన్ని నిరూపించుకున్న చారిత్రక దినం బక్రీదు అని తెలిపారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని గుర్తుచేసుకుంటు దైవప్రసన్నత కోసం ఖుర్బానీ ఇచ్చారు. ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రావి వెంకటేశ్వరరావు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



కౌతవరం చెక్‌పోస్టు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# విజేతలకు బహుమతుల ప్రదానం

**కౌతవరం(గుడ్లవల్లేరు):** సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీ షిరిడీసాయి మందిర మహిళా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మందిర అభివృద్ధి చైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్(బాలు) ఆర్థిక సాయంతో గృహోపకరణాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వడ్లమూడి శైలజ, పద్మజ, పడమటి సుజాత పాల్గొన్నారు.



విజేతలను ఎంపిక చేస్తున్న చైర్మన్ బాలు



కౌతవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా నేతలు

## గుడ్లవల్లేరు మండలంలో..

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు యార్లగడ్డ వెంకన్న, తెదేపా నేతలు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, మేకా అమలేశ్వరరావు, విన్నకోట పాములు, తదితరులు పాల్గొన్నారు.

## గౌతు లచ్చన్న జయంతి



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘీయులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** సర్దార్ గౌతు లచ్చన్న పోరాటస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, మార్గదర్శకత్వం, గురుశిష్యుల అనుబంధాలు ఎన్ని తరాల వారికైనా అనుసరణీయమేనని జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కౌతవరంలో లచ్చన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచి పడమట సుజాత, సొసైటీ అధ్యక్షుడు బొబ్బా నరసింహారావు, కానూరి చిట్టిబాబు, విగ్రహదాత పరసా పోతురాజు, మేకా అమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

## గౌతు లచ్చన్నకు ఘన నివాళి



కౌతవరం(గుడ్లవల్లేరు): సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుజాత లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కానూరి రామ్మోహనరావు, డైరెక్టర్లు పరసా పోతురాజు, చిట్టిబొమ్మ నాని, పలువురు గౌడ సంఘీయులు పాల్గొన్నారు.

సాక్షి Wed, 17 August 2016
epaper.sakshi.com/c/12534310

## కౌతవరంలో నేడు గీతాజయంతి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** గీతాజయంతిని పురస్కరించుకుని మండలంలోని కౌతవరం శ్రీకృష్ణ ధ్యానమందిరంలో శనివారం సామూహిక గీతాజయంతి పూజలు, గీతాపఠనం, వాటికి అర్థవ్యాఖ్యానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కేఆర్పీ తెలిపారు.

## గీతాజయంతి కార్యక్రమాలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో గీతా జయంతిని పురస్కరించుకుని శనివారం సామూహిక గీతాపఠనం నిర్వహించారు. నిర్వాహకులు కేఆర్పీ భగవద్గీతలోని పలు అధ్యాయాల్లోని శ్లోకాలకు అర్థవంతమైన వ్యాఖ్యానాలతో సందేహాలను నివృత్తి చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# కౌతవరంలో శతాధిక వృద్ధురాలి మృతి



బొబ్బా రాజ్యలక్ష్మి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని శతాధిక వృద్ధురాలు బొబ్బా రాజ్యలక్ష్మి(110) మంగళవారం రాత్రి మృతి చెందారు. మరణానికి నాలుగు రోజుల ముందు వరకూ ఆమె తన పనులు తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉన్నారు. హఠాత్తుగా జ్వరం వచ్చి స్వగృహంలో ఆమె కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, భాజపా మండలాధ్యక్షులు వడ్లమూడి రవీంద్రబాబు, నీటి సంఘాధ్యక్షుడు వడ్లమూడి దేశపతి, ఎరువుల దుకాణాల సంఘం మండల అధ్యక్షుడు బొబ్బా కృష్ణమూర్తి, తదితరులు బుధవారం నివాళులర్పించారు.

## వాడవాడలా గంగానమ్మ తల్లి ఉత్సవాలు



కౌతవరంలో గుడిముందు భక్తుల బారులు

## వైభవంగా శ్రీకనకదుర్గమ్మ 106వ వార్షిక సంబరం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** శ్రావణ చివరి ఆదివారం పురస్కరించుకుని కౌతవరం ఒకటో వార్డులో ఆదివారం శ్రీకనకదుర్గమ్మతల్లి 106వ వార్షిక సంబరం నిర్వహించారు. 105 ఏళ్లుగా అమ్మవారి సంబరాలను పెద్దఎత్తున నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద నుంచి అమ్మవారి భారీప్రభను అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలు, డప్పు విన్యాసాలు, జానపద కళారూపాల ప్రదర్శనగా కౌతవరం, కూరాడ, గుడ్లవల్లేరుల్లో భారీ గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి ఇంటా అమ్మవారికి పుసుపు నీరు వార పోసి మొక్కలు తీర్చుకున్నారు. పెద్దఎత్తున మహిళలు తరలిరావడంతో కౌతవరం 1వ వార్డు, కూరాడ లాకుదిగువున ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పుల్లయ్య శిష్యబృందం ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

## ఆనందాల నిమజ్జనోత్సవాలు



నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు

**కౌతవరం(గుడ్లవల్లేరు):** మండలంలోని కౌతవరంలో శ్రీషిర్డీసాయి ఆలయంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి మహిళలే గణపతి నవరాత్రులను నిర్వహించారు. బుధవారం ట్రాక్టర్‌పై గ్రామోత్సవం జరిపారు. అనంతరం స్థానిక బంటుమిల్లి కాల్వలో విగ్రహాన్ని మహిళలే మోసుకుంటూ వెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అర్చకులు దావలి మల్లికార్జునశర్మ, బొబ్బా ఝాన్సీలక్ష్మీ, రంగనాయకమ్మ, కల్లేపల్లి సుధారాణి, పడమట సుజాత పాల్గొన్నారు.

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో నవరాత్రుల ముగింపు సందర్భంగా బుధవారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఎడ్లబండిపై ఉత్సవమూర్తులు, విగ్రహాన్ని మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం జరిపారు. ఆలయనిర్వాహకులు, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, నీటి సంఘం అధ్యక్షులు కానూరి సత్యంబాబు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, కొల్లి శేషారావు, బొబ్బా నరసింహారావు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం షిర్డీసాయి ఆలయం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పురిటిపాటి ప్రత్యూష, యామిని, శీలం కుమారిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 10 వేల విలువైన వస్తుసామగ్రిని అందజేశారు.



సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు

# కౌతవరంలో ముగ్గుల పోటీలు

**గుడ్లవల్లేరు** : కౌతవరం షిరిడిసాయి మందిరం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు లయన్స్ జిల్లా నాయకుడు గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్ దంపతులు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం సుభాష్‌చంద్రబోస్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఆలయ చైర్మన్ బాలు, కౌతవరం సర్పంచ్ పడమటి సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Mon, 16 January 2017
epaper.andhrajyothy.com//c/16135411